# 'జామీను ఇచ్చి వదిలించండి'

* ఆర్. శేషగిరిరావు *

ఆదివారం కావటంవల్ల రంగారావు తాపీగా కూర్చొని ఆలోచిస్తున్నాడు. కవరుమీద అడ్రసు వ్రాసి ఉంచాడు. ఈ మాటు లక్ష్మిచేత యింటికి వుత్తరం వ్రాయించటం కష్టమైన పనిగానే కనపడింది.

"లక్ష్మీ! యీ సారికి నా మాట విను. ఇంట్లో ఎవ్వరికీ కానిలేని సంగతి నీకు తెలుసుకదా. ఈలాంటప్పుడు వుత్తరం వ్రాయనని నీవు మొండిపట్టు పడితే ఏమైనట్టు? నీవు రాస్తే ఆ ముసలాయన తిట్టుకుంటూనో, దీవించుకుంటూనో పాతికరూపాయలు పంపుతాడు. ఈ నెల కనక గడుపుకున్నామా అంటే వచ్చే నెలనుంచైనా జాగ్రత్తగా ఉందాం" అని అన్నాడు రంగారావు లక్ష్మిముఖంలోకి చూస్తూ.

"నన్ను మీరేమిచేసినా సరే, నేను మాత్రం యింటికి వుత్తరం వ్రాయను. పస్తుండమంటే ఉంటాను. అయినా నూటయిరవైరూపాయల్లో యిద్దరం గడుపుకోలేక ప్రతినెల వాళ్ళను దేబిరించడమేమిటి" అని అడిగింది నిర్మొఖమాటంగా.

"అవును. నీవు చెప్పింది నిజమే. కాని నేను మాత్రం డబ్బంతా అనవసరంగా ఖర్చుచేస్తున్నానా? పేకాటలోగాని, త్రాగుడుకుగాని, డబ్బంతా పాడుచేస్తే అనుకోవచ్చు; ఈ మద్రాసులో జీవితం యిలాంటిది. ఎంత డబ్బు వచ్చినా దరిద్రమే" అన్నాడు.

"చేతులారా చేసుకుంటే దరిద్రం రాకేంచేస్తుంది? జీతం వచ్చేసరికి ఇంటికి భోజనానికి కూడా రావటానికి తీరదు. మీ బీచ్చిషికారులేమిటో, మీ ఆంధ్రమహాసభలేమిటో, మీ స్నేహితులేమిటో. అప్పుడు నేనేమీ కనపడను. ఇంటికి వుత్తరం వ్రాయాల్సి వచ్చేటపుడు మాత్రం ఆ మాటా, యీ మాటా చెప్పి మీ పని చేయించుకుంటారు. ఇంకా నాలురోజులకి జీతం వస్తుందనగానే సరిగా మాట్లాడటంకూడా మానేస్తారు. డబ్బంతా ఖర్చుపెట్టేది మీరు; ఇంటికి డబ్బుకోసం వ్రాసి చీవాట్లు తినేది నేను" అన్నది లక్ష్మి.

"ఇష్టం వచ్చినట్లు ఏం ఖర్చుపెట్టానంటావు? క్రిందటి నెలలో అరవైరూపాయలు బాకీ తీర్చానా? పోతే అరవైరూపాయలు మిగిలినై. అంతా యింటి క్రిందే ఖర్చయింది కదా. అయినా లక్ష్మీ! నాకేం ఖర్చు చెప్పు. రోజుకు మహా అయితే ఎనిమిదిఅణాలకంటే ఎక్కువ అవదు. నాకవన్నీ ఎందుకు, నా ఖర్చుకు కావలసిన 15 రూపాయలు నేను తీసికొని యీ నెలనుంచి మిగతా డబ్బంతా నీకే యిస్తాను. ఇల్లంతా నీవే గడుపుకో. సరేనా?" అని రంగారావు అడిగాడు చిరునవ్వు నవ్వుతూ.

'అబ్బ! ఎంత బుద్ధిమంతులండీ, పాపం- మద్రాసులో కాపురం పెట్టి మూడేళ్ళయింది. మీరు ఉద్యోగం చేయటం మొదలెట్టి నాలుగేళ్ళయింది. ఎప్పుడైనా ఒక్కసారి లక్ష్మీ! యివిగో యీ పదిరూపాయలు తీసుకో అన్నారా-అయినంతవరకు నా దగ్గరవి కాజెయ్యటం తప్ప. నెలవచ్చేటప్పటికి, ఆ బాకీలు తీర్చాను, యీ బాకీలు తీర్చాను అని దొంగలెక్కలన్నీ చెప్పి డబ్బుయివ్వకపోయిందలేది. ఈ త్తరం రాయమని నా ప్రాణాలు తీసేది. నేను మాత్రం యింటికి రాయను బాబు" అని నవ్వుతూ వెళ్ళిపోయింది.

రంగారావు లక్ష్మిని పిల్చి "అయితే నేను దొంగలెక్కలు వేస్తున్నానా? బ్యాంకిలో పని చేసేవాడ్ని కదా అంత అన్యాయంగా మాట్లాడితే ఎట్లా? ఇంతకూ పర్యవసానం ఏం తేల్చావు?" అని అడిగాడు.

"బ్యాంకి లెక్కలు ఎలా వేస్తున్నారో కాని యింటి లెక్కలు ముమ్మాటికి దగా లెక్కలే. అక్కడకూడా యిలాగే చేస్తున్నారేమో. అందుకనే నాలుగేండ్లయినా పద్దిరూపాయలు ప్రమోషన్ కూడా యింతవరకు......" అంటూ లక్ష్మి లేచిపోయింది.

రంగారావు మనస్సు చివుక్కుమంది.

కాని యిది వాండ్లకు మామూలే.

★

"అయితే వుత్తరం రాస్తానంటావా? లేదా?" అన్నాడు రంగారావు.

"మీరు చెప్పినట్లు మీ ఖర్చుకు కావలసింది వుంచుకొని మిగతా జీతం నాకిస్తానంటే వ్రాస్తాను."

"తప్పకుండా. అంతకంటే నాకు కావలసిందేమిటి! ఆ బాధ్యత అంతా నీ మీదే ఉంటుంది."

"అవును యిప్పుడిలాగే మాట్లాడుతారు. నెల చివరకు మౌనముద్ర వహిస్తారు" అంది లక్ష్మి.

"కాదు తప్పకుండా యిస్తాను. లేకపోతే నీవే తీసుకో జేబులోనుంచి" అన్నాను ధైర్యంగా.

"చూస్తానుగా" అంటూ రంగారావు దగ్గరనుంచి అడ్రసు వ్రాసియున్న కవరు తీసుకుంది లక్ష్మి.

రంగారావుకు గండం గడిచినట్లుయింది.

★

లక్ష్మికి ఎలాగో తెలుసు-నెలవచ్చేటప్పటికి రంగారావు ముఖం తప్పిస్తాడని. అందువల్ల యీ తడవ పూనుకోవాలనిపించింది. నెల చివర వచ్చింది. లక్ష్మి అన్నయ్యకూడా బ్యాంకిలో పనిచేస్తాడు. అతన్ని పిల్చి లక్ష్మి తనకు తోచిన వుపాయం చెప్పింది. అతను సరేనన్నాడు. జీతాలు వచ్చినయి. రంగారావు డబ్బు కోటుజేబులో పెట్టి మామూలుగా కుర్చీ వెనక తగిలించి కాఫీకి వెళ్లాడు. లక్ష్మి అన్నయ్య యీ అవకాశంకోసమే ఎదురుచూస్తున్నాడు. తను ఏం చేసిందీ వ్రాసియుంచిన యుత్తరం రంగారావు జేబులో పెట్టాడు. ఒక పదిహేనురూపాయలు మాత్రం వుంచి మిగతావి తీసుకవెళ్ళి లక్ష్మికి ఇచ్చాడు. ఇంటికి వచ్చిన తర్వాత రంగారావు జేబు చూసుకొని ఆశ్చర్యపడ్డాడు. ఉత్తరం ఉండటంవల్ల మనస్సు కుదుటపడ్డది. సరేననుకున్నాడు.

★

"లక్ష్మీ! నీకోసరం పోలీసులు వచ్చారు" అన్నాడు.

"ఇంకేం! జామీను యిచ్చి వదిలించండి" అంది లక్ష్మి.

"అబ్బ ఎంత ప్రజ్ఞాశాలివి? ఆరితేరిన జేబు దొంగల్లే యున్నావే."

"ఆ మాట ఎందుకులెండి. ఎట్లా అయినా మీది ఆడితప్పని రంకంగా! అందువల్ల మీ మాట నిలబెట్టాను" అంది లక్ష్మి సగర్వంగా.





# నేతాజీ ఆమ్లా హేరాయిల్

సువాసనతోకూడిన వనమూలికలతో తయారుకాబడినది

★

తలవెండ్రుకలను పెంచును. కుదుళ్ళకు బలమునిచ్చి నల్లగ నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకల నిచ్చుటలో సాటిలేనిది. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకుట మొదలగువానిని నివారించును. అన్నివేళలకు ఆనందమునిచ్చి శీతల పరిమళము కలిగియుండును. వాడిన ఎడల గుణమును గుర్తించగలరు.

సీసా 1 కి రూ. 1-8-0. పోస్టేజి ప్రత్యేకం.

శ్రీ కృష్ణా సోప్ వర్క్సు, శివాలయం వీధి, బెజవాడ.